


సోమశిలకు 2,194 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 2,194 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 71.622 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.



చుక్కలు మురిసె.. అవని మెరిసె..

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

నెల్లూరు, కావలి, గూడూరులో నిర్వహణ

తరలివచ్చిన నారీలోకం

విజేతలకు బహుమతుల అందజేత

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలతో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంక్రాంతి శోభ వచ్చింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్-ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నిర్వహించిన ఈ పోటీలకు నెల్లూరు, కావలి, గూడూరు పట్టణాల్లో భారీగా మహిళలు పాల్గొన్నారు. అందమైన రంగవల్లులతో మైదానాలకు సంక్రాంతి పూలు పూయించారు. తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయలను ఇనుమడింప జేసేలా అందమైన ముగ్గులు తీర్చిదిద్దడానికి ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. 11 ఏళ్ల బాలికల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు నారీమణులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీలకు నెల్లూరులోని సీఎంఆర్ షాపింగ్ మాల్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ విజేతలకు పట్టు చీర, ద్వితీయ విజేతకు వర్క్ శారీ, తృతీయ విజేతకు డిజైనర్ శారీలతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలతోపాటు పోటీలో పాలొన్న ప్రతి మహిళకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : వీఆర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీలకు నారీమణులు భారీగా తరలివచ్చారు. బాలికలతోపాటు ముస్లిం మహిళలు కూడా ఈ పోటాల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలు పి.నాగేశ్వరమ్మ, డాక్టర్ ప్రసన్న పూర్ణ, సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి క్షుణ్ణంగా పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు. నవాబ్ పేటకు చెందిన దేవరపల్లి ఉష ప్రథ మ, ముత్తుకూరుకు చెందిన శారద ద్వితీయ, సుజాత తృతీయ బహుమతులను గెలుచుకు న్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సీఎంఆర్-చందన బ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు హరికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు.





ద్వితీయ, తృతీయ విజేతలు శారద, సుజాత



నెల్లూరు: ప్రథమ విజేత దేవరపల్లి ఉషకు బహుమతి అందజేస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, సీఎంఆర్-చందన బ్రదర్స్ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య తదితరులు


గూడూరు : స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీల్లో 45 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ , ద్వితీయ బహుమతిని గూడూరు మండలం నెల్లటూరుకు చెందిన ఎస్.సుస్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మ గెలుచుకున్నారు. డీఎస్పీ వీవీ రమణకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు.

గూడూరులో..



విష్ణుప్రియకు ప్రథమ బహుమతి ఇస్తున్న డీఎస్పీ రమణకుమార్ తదితరులు

వీరితోపాటు కన్సోలేషన్, ప్రత్యేక బహుమతులను పాశం సంధ్యారాణి సహకారంతో అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు పాల్గొన్నారు.



కావలి/కావలిటౌన్ : పట్టణంలోని రైల్వేరోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూము ఆవరణలో ముత్యాల ముగ్గుల పోటీలు కోలాహలంగా జరిగాయి. న్యాయనిర్ణేతల అంచనాలకు అందని విధంగా రంగవల్లులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపిక ప్రక్రియ ఆలస్యమైంది. చివరకు న్యాయనిర్ణేతలు ఉమాశర్మ, జమున, లక్ష్మి విజేతలను ప్రకటించారు. పట్టణంలోని బుడంగుంట కాలనీకి చెందిన వల్లెపు లక్ష్మీ, రెండో బహుమతిని పాతూరు ఈతముక్కల వారి వీధికి చెందిన క్రిష్ణంశెట్టి సరోజనమ్మ, తృతీయ బహుమతిని వెంగళరావునగర్‌కు చెందిన తంగుటూరి శ్రీలక్ష్మి గెలుచుకున్నారు. వీరికి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బహుమతులు అందజేశారు.

కావలిలో..



కావలి : ప్రథమ బహుమతి విజేత లక్ష్మికి బహుమతి అందజేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్, కిశోర్ తదితరులు





ద్వితీయ, తృతీయ విజేతలు నారాయణమ్మ, శ్రీలక్ష్మి

బోగస్‌పై దృష్టి

నేటి నుంచి పింఛన్ల పరిశీలన

తొలుత దివ్యాంగులు, డీఎంహెచ్‌వో పెన్షన్ల తనిఖీ

వైద్య, సాంకేతిక సిబ్బందితో ప్రత్యేక బృందాలు

గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్ల జారీ

వాటి ద్వారా లబ్ధి పొందుతున్నట్లు ఫిర్యాదులు

కొన్ని నిర్ధారణ కావడంతో విచారణకు ఉత్తర్వులు

జలదంకిలో ఓ వ్యక్తి ఆరోగ్యం బాగున్నా దివ్యాంగుల (డిసేబుల్డ్) కోటాలో పింఛన్ పొందుతున్నాడని ఇటీవల ప్రజా విజ్ఞపుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ విషయమై స్థానిక డీఆర్‌డీఏ, వైద్యసిబ్బంది విచారించగా, ఆ వ్యక్తికి ఎలాంటి వైకల్యం లేదని తేలింది. నకిలీ డిసేబుల్డ్ సర్టిఫికెట్‌తో పింఛన్ పొందుతున్నట్లు గుర్తించి పింఛన్‌ను నిలిపేశారు. జిల్లాలో దొంగ సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్నారనడానికి ఇదొక ఉదాహరణ. ఇలాంటివి ఎన్నో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, ఆ క్రమంలోనే అధికంగా డిసేబుల్డ్ పింఛన్లు మంజూరు చేయడంతో బోగస్ పింఛన్లపై అనుమానాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జిల్లాలో ఈ రెండు కేటగిరీల్లో ఉన్న పింఛన్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ పింఛన్ల తనిఖీకి సంబంధించిన విధివిధానాలు జిల్లా అధికారులకు అందాయి. సోమవారం నుంచి ఈ తనిఖీలు ప్రారంభం కానున్నాయి.

-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అన్నిరకాల పింఛన్లు 3,10,029 ఉన్నాయి. అందులో అత్యధికంగా వృద్ధాప్య పింఛన్లు 1,65,356 ఉండగా, మూడో స్థానంలో డిసేబుల్డ్ పింఛన్లు 32,773 ఉన్నాయి. అలాగే డీఎంహెచ్‌వో పింఛన్లు మరో 1978 ఉన్నాయి. డిసేబుల్డ్ పింఛన్ కింద ప్రతినెలా రూ.6 వేలు అందిస్తుండగా, డీఎంహెచ్‌వో పింఛన్ కింద రూ.15 వేలు ఇస్తున్నారు. జిల్లాలో ప్రతినెలా రూ.131.63 కోట్లను పింఛన్ల కింద చెల్లిస్తుండగా, అందులో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్‌దారులకు సుమారు రూ.22 కోట్లను అందిస్తున్నారు. అయితే ఈ జాబితాలో అనర్హులు కూడా ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించగా కొన్ని నిర్ధారణ జరగడంతో ఆ పింఛన్లను నిలిపేశారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పింఛన్లను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా దొంగ సర్టిఫికెట్లతో కొందరు డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల కింద పింఛన్లు పొందుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండు కేటగిరీల్లోని పింఛన్లను పరిశీలించేందుకు నిర్ణయం తీసుకుంది.

● ప్రత్యేక బృందాల ఏర్పాటు

డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లు పొందాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. శాశ్వత వైకల్యం ఉన్న వారికి మాత్రమే డిసేబుల్డ్ కింద పింఛన్ మంజూ రు చేస్తారు. అది కూడా వివిధ కేటగిరీలకు ఇంత పర్సంటేజీ డిసేబులిటీ ఉంటేనే పింఛన్ మంజూరవుతుంది. అలానే పూర్తిగా మంచానికే పరిమితమైనవారికి డీఎంహెచ్‌వో కేటగిరి కింద పింఛను ఇస్తారు. ఈ రెండు కేటగిరీలకు మెడికల్ సర్టిఫికెట్లు సమర్పిం చాల్సి ఉంటుంది. డిసేబుల్ పింఛను పొందా లంటే సదరం సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇప్పుడు ఈ కేట గిరీలకు సంబంధిం చిన పింఛన్లను తనిఖీ చేసేందుకు డీఆర్‌డీఏ టెక్ని కల్ సిబ్బందితో పాటు వైద్యసిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ఒక షెడ్యూల్ ప్రకారం పింఛన్ దారుడి వద్దకు వెళ్లి పరిశీలిస్తారు. నిజంగానే పింఛన్ దారుడికి వైకల్యం ఉందా... ఉంటే ఎంత మేరకు ఉంది... వీరు పింఛను పొందేందుకు అర్హులా.. కాదా...? అనే వివరాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తారు.

> **నేటి నుంచి తనిఖీలు**
>
> డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్లను పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. తనిఖీలకు వైద్య సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. సోమవారం (నేటి) నుంచి తనిఖీలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
>
> **- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ**



● సదరం స్లాట్ల నిలిపివేత

గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీచేయడం, వాటిపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సదరం స్లాట్లను కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది. వీటిపై విచారణ పూర్తయ్యే వరకు సదరం స్లాట్లను అనుమ తించరు. ఇప్పటికే స్లాటు పొందిన వారికి మాత్రం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

మామిడికి వర్షం దెబ్బ

ఆలస్యంగా పూత ప్రారంభం

కాపుపై ప్రభావం చూపే అవకాశం

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అల్పపీడనం, తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మామిడిలో పూత ఆలస్యమైంది. సాధారణంగా డిసెంబరు రెండు లేదా మూడో వారం నుంచి మామిడిలో పూత ప్రారంభమవుతుంది. ఫిబ్రవరికి బఠాణీ గింజంత పిందెలతో మామిడి తోటలు దర్శనమిస్తాయి. అలాంటిది ఇప్పటివరకు పూత పూయలేదు. దీంతో రైతులు తమకు తోచిన విధంగా రకరకాల రసాయనిక మందులు పిచకారి చేస్తున్నారు.

● వేలాది ఎకరాల్లో సాగు

ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో మామిడి సాగు సుమారు 10,000 ఎకరాల్లో ఉంది. ఇప్పటికే కొన్ని తోటల్లో 20శాతం పూత వేయగా, మిగిలిన చెట్లు పూమొగ్గ వేసున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నేలలో తేమ శాతం అధికంగా ఉండటం, పూమొగ్గకు సరిపడా ఉష్ణోగ్రతను అందించలేకపోవడంతో పూతకాడలు వేయడం ఆలస్యం అవుతున్నదని రైతులు అంటున్నారు. రానున్న రోజుల్లో వాతావరణంలో ఎలాంటి మార్పులు లేకుండా, వర్షాలు కురకుండా ఉంటే మామిడిలో పూత, పిందె నిలుస్తాయని వారంటున్నారు. అలాకాకుండా విపత్కర పరిస్థితులు ఎదురైతే మామిడిపై ఆశలు వదులుకోవాల్సిందేనని అభిప్రాయ పడుతున్నారు.

ఆలిండియా క్యారమ్స్ పోటీల ప్రారంభం

● జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల రాక ● తొలిరోజు పోరు హోరాహోరీ

నగరంలోని నెల్లూరు క్లబ్‌లో ఏపీ క్యారమ్స్ అసోసియేషన్, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 29వ ఆలిండియా ఫెడరేషన్ కప్ ఛాంపియన్ షిప్‌ను ప్రారంభించారు.స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్యారమ్స్ పోటీలను ఆరంభించారు.ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అసోం పార్లమెంట్ సభ్యుడు రఖిబుల్ హుస్సేన్, జాతీయ, అంతర్జాతీయ క్యారమ్స్ క్రీడాసంఘాల ప్రతినిధులతోపాటు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ విజేతలు శ్రీనివాస్, ఖజీమా, అర్జున అవార్డు గ్రహీత అంథోని మరియ ఇరుదయంతోపాటు ఇతర క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. అనంతరం తొలిరోజు పోటీలు వివిధ రాష్ట్రాల క్రీడాకారుల మధ్య హోరాహోరీగా సాగాయి. మరో మూడురోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.

- వివరాలు 6లో



కాంగ్రెస్ కార్యాలయంలో చోరీయత్నం

● వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కావలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్మూర్తిపేట కాంగ్రెస్ కార్యాలయంలో చోరీ యత్నాన్ని కార్యాలయ ఇన్‌చార్జి పైడి రవీంద్ర బాబు గుర్తించారు. ఆదివారం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని దుండగులు కార్యాలయం కిటికీ గ్రిల్ తొలగించి లోపలికి ప్రవేశించారని కార్యాలయంలో వస్తువులు పోలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.



దేశ సమగ్రత కోసం పాదయాత్ర

దేశ సమగ్రత కోరుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్ సమీపంలోని జార్‌గ్రామ్ గ్రామానికి చెందిన బిష్వాల్ ముర్ము పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ఆయన పాదయాత్ర చేస్తూ కోవూరుకు చేరుకున్నాడు. ఆయన మాట్లాడుతూ రెండు నెలల కిందట కోల్‌కతా నుంచి పాదయాత్ర చేపట్టానని, కన్యాకుమారి వరకు తాను నడవనున్నట్లు వివరించారు. అక్కడి నుంచి అరేబియా సముద్రం తీరాన పాదయాత్ర సాగుతుందని చెప్పారు. భుజానికి జాతీయ జెండా ధరించి ఆయన చేపట్టిన పాదయాత్ర అందరినీ ఆకట్టుకుంది. బిష్వాల్ ముర్మును సుభాష్ సేవా సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి కలిసి అభినందించారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

గోవింద హరే... వేణుగోపాల హరే!!



దేవేరులతో వేణుగోపాలుడి అలంకారంలో వేణుగోపాలస్వామి



విశేష పుష్పాలంకారంలో శ్రీరంగనాథస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, తల్పగిరి రంగనాథ స్వామి ఆలయాల్లో అధ్యయనోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి వేణుగోపాల స్వామికి నిజరూప అలంకరణ, శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి విశేష పుష్పాలంకారం జరిగాయి. ఆళ్వార్ల ఘోష్టి, దివ్యనాలాయిర ఘోష్టి గానం, శాత్తుమురై, ప్రాకారోత్సవాలు జరిగాయి. గోదా దేవికి విశేష అలంకారం, ధనుర్మాస పూజలు చేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణ అధికారులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా ఎదగండి

● ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



రైతులతో చర్చిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఏఎస్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎస్సీ కులాల ఉప వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని అను మసముద్రం గ్రామంలోని సిజెఎఫ్ఎస్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా బీడుగా ఉన్న సుమారు 250 ఎకరాల పొలాలు నేడు మామిడి, సపోట, నేరేడు తోటలతో కళకళ లాడుతున్నాయి. ఇందుకోసం రైతుల పడ్డ శ్రమ, కష్టం గురించి వారినే అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందించడంతో పాటు బోర్లు, మోటార్ల ఏర్పాటుకు కూడా సహాయం అందిస్తోందని, ఎస్సీ రైతులు తమ పొలాలను లీజుకు ఇవ్వకుండా తామే సాగు చేసుకోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, కష్టపడి సాగుచేసిన పంటను సరైన ధరకు అమ్ముకోగలిగితే వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్నారు. అనంతరం సొంత ఇల్లు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కాగా, పర్యటనకు గుర్తుగా పొలంలో నేరేడు మొక్క ను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఏపిఎంఐపి పిడి శ్రీనివాసులు, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, ఎపిడి శంకర్ నారాయణ, ఎంపీడీవో ప్రసన్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాకతో అధికారుల హడావుడి

కావలి, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిత్ర ఆదివారం కావలికి వచ్చారు. నెల్లూరు నుంచి ఏఎస్‌పేట వెళ్లి అక్కడ నుంచి విజయవాడ వెళుతూ మార్గమధ్యలో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కాసేపు నిలిచారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీధర్‌తో పాటు రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హడావుడి చెందారు. టీ బ్రేక్ అనంతరం ఆయన విజయవాడకు బయలుదేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ అధికారుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

● పండుగ రోజుల్లో అవగాహన సదస్సులు, ఆకస్మిక దాడులు

● ఇప్పటి వరకు 4 కేసుల నమోదు, ఐదుగురి అరెస్టు

● జిల్లాలో నవోదయం-2 అమలు

నెల్లూరు(క్రైం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను సారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం నవోదయం-2ను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లా ఎక్సైజ్ అధికారులు సంక్రాంతి పండుగ రోజుల్లో జిల్లావ్యాప్తంగా నాటుసారా తయారీ, విక్రయాలు, ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో సారా ప్రభావం ఉండే ప్రాంతాలను గుర్తించి, వాటిని ఏ, బీ, సీ కేటగిరిలుగా విభజించుకొని ప్రతిరోజూ ఆ ప్రాంతాల్లో ప్రత్యేక బృందం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అంతేకాక ఆయా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సారాకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

● గ్రామాల గుర్తింపు

జిల్లాలో సారాతయారీ, విక్రయాలు, సరఫరా చేసే రెండు మండలాల్లోని కొన్ని గ్రామాలను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. బోగోలు మండలం కప్ప రాళ్లతిప్ప, చెంచులక్ష్మీపురం, సోమేశ్వరపురం, బోగోలు, తల్లూరు, నాగులవరం, కడనూతల, దగదర్తి మండలం ఉలవపాడులో సారాతయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు వారు గుర్తించారు.

● ఓ వైపు సదస్సులు, మరో వైపు దాడులు

జిల్లాలో సారాను పూర్తిగా నిషేధించేందుకు ఎక్సైజ్ అధికారులు స్పెషల్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నారు. ప్రధానంగా సంక్రాంతి మూడు రోజులు సారా అధికంగా తయారీ అవుతుందని సమాచారం అందుకుని, ప్రతి రోజూ బోగోలు, దగదర్తి మండలాల్లో గుర్తించిన గ్రామాల్లో అవగా హన సదస్సులు, ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో జిల్లాలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్లలోని ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లు పాల్గొంటున్నారు. ఇలా ఈనెల చివరివరకు వరుస దాడులు నిర్వహించనున్నారు. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 4 కేసులు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేశారు. 225 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు.

దాడులతోపాటు అవగాహన కల్పిస్తున్నాం



నవోదయం-2లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సారా తయారీ, విక్ర యాలు, సరఫరాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఇందులో భాగంగా రెండు మండలాల్లోని కొన్ని గ్రామాలను గుర్తించి వాటిపై మరింతగా దృష్టి పెట్టాం. గ్రామాల్లోని ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి సారా జోలికి వెళ్లవద్దంటూ అవగాహన కల్పిస్తున్నాం. వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కావాల్నో... వారి వద్ద నుంచే అర్జీలు తీసుకుంటున్నాం. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకుకెళతాం.

-టీ శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీసీ



బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీ శ్రీనివాసరావు, ఎక్సైజ్ అధికారులు (ఫైల్)



జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కృష్ణమోహన్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్

● జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

వెంకటాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చదువుతోపాటు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి ఏ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు **జోనల్-3కి సంబంధించి 8 బీసీ గురుకుల** బాలికల పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా విద్యార్థినిలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో చాలా లాభాలు ఉన్నాయని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. శారీరక ధృఢత్వం తో సంపూర్ణ ఆరోగ్యం, సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. తొలిరోజు పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, క్యారమ్స్, చెస్, షటిల్ తదితర క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ పీ మాధవయ్య, జిల్లా కన్వీనర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ దమ్ము కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా శాంతరాజు



వ్యవసాయ సంఘం నూతన జిల్లా కార్యవర్గంతో రాష్ట్ర సంఘం నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సం ఘం జిల్లా అధ్యక్షుడిగా యం.శాంతరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని రైల్వే ఫీడర్సురోడ్డు టీసీ ల్యాబ్ సమావేశ మందిరంలో ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు టీవీ .రామిరెడ్డి, సహ అధ్యక్షుడు రఘురామనాయుడు, కోశాధికారి శ్రీహరి, ఉపాధ్యక్షులు జహీర్‌అహ్మద్, రూపేష్‌కుమార్, శ్రీహరి, సురేంద్ర, కడప జిల్లా అధ్యక్షుడు ప్రసాదుగౌడ్, కార్యదర్శి గిరిధర్‌ల సమక్షంలో జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శిగా ఎంవీ .సువర్ణకుమారి, సహాధ్యక్షు డిగా నాగరాజు, కోశాధికారిగా పి.సత్యం, ఉపాధ్యక్షులుగా రోజామణి, మహబూబ్ బాషా, మురళి, సంయుక్త కార్యదర్శిలుగా అనిల్, సాత్విక్‌రాజు, శివాజీ, సాయిసునైని, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పీవీ.నాగలక్ష్మి, డేవిడ్, జిల్లా ఈసీ సభ్యులుగా సందీప్ రాజు, బాలబ్రహ్మయ్య, రమేష్, కౌసల్యమ్మ, రాష్ట్ర ఈసీ సభ్యులుగా నివాంత్ అహ్మద్ ఎంపిక య్యారు. ఎన్నికల అధికారిగా వీ రఘురామనాయుడు వ్యవహరించారు. ఈసంద ర్భంగా వ్యవసాయశాఖలో ఉన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. ఏపీజీఈవో జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలి

● ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు సుబ్రహ్మణ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నైపుణ్యం కలిగిన డ్రైవర్లు, మెకానిక్‌లు, సిబ్బంది ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఏపీఎస్ ఆర్టీసీకి కేటాయించనున్న విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు కాకుండా ఆర్టీసీకే అప్పగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ డిప్యూటీ జనరల్ కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ప్రాంగణంలో ఉన్న సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య నివారణ ముసుగులో ప్రైవేటు విద్యుత్ వాహనాలకు పచ్చజెండా ఊపి ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నాయని ఆరోపించారు. పీఎంఈ బస్సుల పథకం ద్వారా రాష్ట్రంలోని 11 నగరాల్లో ఈ సంవత్సరం 750 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నారని, వాటి ద్వారా 3750 మంది ఆర్టీసీ ఉద్యోగులు మిగులుగా తేలుస్తారని చెప్పారు. ఇలా 2029 నాటికి అన్నీ విద్యుత్ బస్సులే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని, అది అమలైతే ఆర్టీసీలో రెగ్యులర్ ఉద్యోగులే ఉండరని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు 70 విద్యుత్ బస్సులు రానున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సుల ను కొనుగోలు చేసి ఆర్టీసీకే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ అంశంపై మంగళవారం విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ తీర్మానించిందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా సుబ్రహ్మణ్యం

విజన్- 2047 సాధనే లక్ష్యం

స్వర్ణాంధ్ర చైతన్య యాత్రలో భారత సేవా ఫౌండేషన్



చైతన్య యాత్రలో మాట్లాడుతున్న షేక్ ఖాసిం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రకటించిన స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనే లక్ష్యంగా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర చైతన్య యాత్రను నిర్వహించామని భారతసేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం తెలిపారు. ఆదివారం ఉదయం నెల్లూరులోని గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రజలు, రాజకీయ నాయకులు, డీకే కళాశాల విద్యార్థినులతో యాత్రను నిర్వహించారు. గాంధీ బొమ్మ వద్ద ఈ ర్యాలీని టీడీపీ అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీతో కలిసి ఖాసిం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజన్-2047లో ప్రకటించిన సంపద, ఆరోగ్యం, ఆనందం అంశాలను సాధించడానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా చైతన్యపరిచే ప్రయత్నమే ఈ కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకురాలు కుసుమ కుమారి గుడ్ల సంచులను ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేశారు. యాత్రలో టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయమ్మ, విశ్రాంత ప్రిన్సిపాల్ మరుపూరు రత్నం, ఏవీ సుబ్బారావు, ఫౌండేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య, శీలక్ష్మి, బాబు, చైతన్య, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు, తాళిబొట్టు చోరీ

నెల్లూరు(క్రైం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఓ నర్సింగ్ హోంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఒక మహిళ మెడలోని సరుడు, తాళిబొట్టు లాకెళ్లాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వీఎంఆర్ నగర్ మూడో వీధిలో బుజ్జమ్మ, పుల్లయ్య దంపతులు నివసిస్తున్నారు. బుజ్జమ్మ మద్రాసు బస్టాండు వద్ద ఉన్న ప్రైవేటు నర్సింగ్ హోంలో 15 ఏళ్లగా ఆయాగా పనిచేస్తోంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరిన బుజ్జమ్మ 7.30 గంటలకు నర్సింగ్ హోం గేటు వద్దకు చేరుకుంది. గేటుదాటి లోపలికి వెళ్లిన వెంటనే గుర్తుతెలియని యువకుడు హిందీలో మాట్లాడుతూ బుజ్జమ్మను చెట్లలోకి తోసేసి ఆమె మెడలో ఉన్న సరుడు, తాళిబొట్టు లాక్కొని పరారయ్యాడు. బుజ్జమ్మ కేకలు వేసినా ప్రయోజనం లేకపోయింది. సుమారు 16 గ్రాముల బంగారం చోరీ జరిగిందని బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7431
వెండి కిలో ధర	రూ. 90,400
వెండి ఒక గ్రాము	రూ.93.40

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడులో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు... గుడిపల్లిపాడుకు చెందిన బీ సాయికిషోర్ (30) వ్యక్తిగత కారణాలతో ఈ నెల 2వ తేదీన గడ్డిమందు తాగి బలవన్మర ణానికి యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

10 నుంచి వాలీబాల్ పోటీలు

కలువాయి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగు మండలాల స్థాయిలో వాలీబాల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు బి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలువాయి, చేజర్ల, అనంతసాగరం, రాపూరు మండలాల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి కల్గినవారు ఈనెల 8వతేదీ లోపు 7702966728, 7093111219 ఫోన్ చేసి తెలపాలని కోరారు.

నార్తుమోపూరులో పోలీస్ పికెట్

అల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నార్తుమోపూరులో శనివారం చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో పోలీసు శాఖ పికెట్ ఏర్పాటు చేసింది. శనివారం నుంచి ఏర్పాటు చేసిన పికెట్ ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

● నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్ల అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్ల అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్ల నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/07034)మధ్య పది రైళ్ల నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి-కాకినాడ టౌన్- చర్లపల్లి (07031/07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్-నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, జనవరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (0702 5/07026) మధ్య ఆరు రైళ్ల అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/07042) మధ్య రెండు రైళ్ల నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక ఇంట్లో చోరీ.. మరో రెండిళ్లలో యత్నం

ఉదయగిరి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. మరో రెండిళ్లలో చోరీకి యత్నించారు. పోలీసుల కథనం మేరకు, శ్రీనగర్‌కాలనీకి చెందిన మెహరాజ్ శనివారం గండిపాళెంలోని పుట్టింటికి వెళ్లింది. ఆమె అత్త ఖాజాబీ పట్టణంలోని సినిమాహాల్‌వీధిలో ఉండే కుమార్తె వద్దకు వెళ్లింది.ఇదే అదునుగా దుండగులు రాత్రి మెహరాజ్ ఇంట్లోకి ప్రవేశించి తలుపు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న మూడు గ్రాముల బంగారు ఆభరణాలు, రూ 15 వేలు నగదు చోరీ చేశారు. ఆ ఇంటి సమీపంలోని మరో రెండిళ్లలో చోరీకి యత్నించడంతో ఇంట్లోని వారు మేలుకోవడంతో దుండగులు పారిపోయారు. కాగా, పుట్టింటికి వెళ్లిన మెహరాజ్ ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తొలగించి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణకు కేరాఫ్ విశ్వం

● 13న సైనిక్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు చివరి గడువు

● కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి



విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ ప్రవేశపరీక్షలకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కేరాఫ్‌గా నిలుస్తోందని సంస్థ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. వరదరాజనగర్‌లోని స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై జాతీయ స్థాయి పోటీ పరీక్షలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారని వెల్లడించారు. 34 సంవత్సరాలుగా తమవద్ద శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. గతేడాది 6, 9తరగతులు సైనిక్ ప్రవేశపరీక్షల్లో ఏపీలో మొదటి ర్యాంకుతోపాటు మొత్తంగా 61మంది విద్యార్థులు సీట్లు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్స్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 13న గడువు ముగుస్తుందని, ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/ 9399976999లను సంప్రదించాలని కోరారు.

మంత్రముగ్ధులై!

ముక్కోటి ఏకాదశికి ఘనంగా ఏర్పాట్లు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే తొలి ముక్కోటి ఏకాదశి ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బత్తల వెంకటలక్ష్మినారాయణ, కదిరి వెంకటమోహన్‌రావు, బొద్దు శివారెడ్డి, ఉప్పు కొండయ్య, బొద్దు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన హిందువులు



సంగం నుంచి హైందవ శంఖారావం సభకు బయలుదేరుతున్న హిందువులు

కందుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్న నినాదంతో ఆదివారం విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు కందుకూరు నుంచి హిందువులు ప్రత్యేక బస్సుల్లో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వీహెచ్‌పీ బాధ్యుడు డాక్టరు తన్నీరు మల్లికార్జున జెండాఊపి వాహనాలను పంపారు. వీరి వెంట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ మతాభిమానులు, మహిళలు ఉన్నారు.

- సంగం : మండలంలోని పలు గ్రామాల నుంచి విజయవాడలో ఆదివారం చేపట్టిన హైందవ శంఖారావం సభకు భారీగా తరలివెళ్లారు. సంగం, సిద్దీపురం, అన్నారెడ్డిపాళెం తదితర గ్రామాల నుంచి హిందువులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు బస్సులు, కారుల్లో తరలివెళ్లారు.
- వింజమూరు : విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభకు వింజమూరు నుంచి 500 మంది హిందువులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కందల మధుసూదన్‌రెడ్డి, డేగ మధుయాదవ్, రమేష్, శార్వాణి, ఏడుకొండలు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆదివారం సీపీఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మండలంలోని బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, బండగానిపల్లి, లింగంనేని పల్లి తదితర గ్రామాలు, కాలనీల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభలకు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారంలో వైద్య శిబిరం ఏర్పాటు



జ్వరాలపై గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కలువాయి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో ఆదివారం కుల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలు విజృంభించిన విషయం పత్రికల్లో రావడంతో వైద్య సిబ్బంది స్పందించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో బ్లీచింగ్, అబెట్ స్ప్రేయింగ్ చేయించారు. మెడికల్ ఆఫీసరు డాక్టర్ అన్వర్ బాషా, పొదలకూరు సబ్ యూనిట్ అధికారి అంజనేయ వర్మ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

● ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీలకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ, వేదికపై డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్

కావలి, కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలకు అపూర్వ స్పందన లభించింది. ఆదివారం స్థానిక రైల్వేరోడ్డులోని కారోనేషన్ రీడింగ్‌రూం ఆవరణలో సంతూర్ సెల్సియా (డిగ్‌సెల్) క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్ సౌజన్యంతో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా మహిళల సందడితో ఆవరణంలో సంక్రాతి శోభ సంతరించుకుంది. ముఖ్య అతిథులుగా ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు అంతరించి పోతున్న తరుణంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ గుత్తికొండ కిషోర్ ప్రోత్సాహక బహుమతుల దాతగా వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జమున, ఉపాధ్యాయురాలు ఉమాశర్మ, సంగీత గురువు లక్ష్మీప్రశాంతి వ్యవహరించి విజేతలను ఎంపిక చేయడంతో పాటు మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు.

సంక్రాంతి ముగ్గులను భావితరాలకు అందించాలి : వంశీకృష్ణ, ఆర్డీవో

తన బాల్యంలో సంక్రాంతి పండుగ వస్తే 2వారాల నుంచి సందడి నెలకొనేదని తెల్లవారుజాము నుంచి మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసేవారు. ఎవరి ఇంటిముందు బాగుందో అని వీదంతా తిరిగి ఆసక్తిగా ముగ్గులు తిలకించేవాళ్లం. పిండి వంటలు ఎక్కువగా చేసేవారు. సంస్కృతి, సాంప్రదాల్లో భాగమైన సంక్రాంతి ముగ్గులను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలి.

ఆరోగ్యానికి.. సుఖశాంతులకు నిలయం : శ్రీధర్, డీఎస్పీ

ఎవ్వరైతే తెల్లవారుజామున లేచి ఇంటిముందు ముగ్గులు వేస్తారో ఆ ఇల్లు ఆరోగ్యానికి, సుఖశాంతులకు నిలయం. ప్రస్తుతం గతంలో వలే ఇళ్ల ముందు ముగ్గులు కనిపించడం లేదు. సెల్‌ఫోనే ప్రపంచం కాకూడదని సంస్కృతి సాంప్రదాలయను విస్మరిస్తే మానవ మనుగడకే ప్రమాదకరం. సంప్రదాయాలు గుర్తుచేలా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.

సంక్రాంతికి చిహ్నాలు : గుత్తికొండ కిషోర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు

సంక్రాంతి అంటేనే రంగవల్లులు అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ముగ్గులు ఇనుమడింపస్తాయి. గత 25ఏళ్ల నుంచి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వారు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటినట్లే అన్నారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పోటీలో పాల్గొనడంతో తన బాల్యంలోని జ్ఞాపకాలు గుర్తొచ్చాయి.



కావలిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆత్మకూరులో శరవేగంగా అభివృద్ధి పనులు

● రాష్ట్ర మంత్రి ఆనం



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీడీవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతగా 199 సిమెంట్ రోడ్లకు రూ. 10.34 కోట్లు మంజూరయ్యాయి.. ఇప్పటివరకు 143 రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించాం.. మిగిలిన రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి సంక్రాంతి పండుగ అనంతరం ప్రారంభోత్సవాలు చేసి పల్లెల్లో రహదారులను అందంగా ముస్తాబు చేస్తామని తెలిపారు. ఆత్మకూరులోని 10 సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రూ. 2.66 కోట్లతో పూర్తిస్థాయిలో అన్ని వసతులతో పునర్నిర్మాణం చేపట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాట వేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో అభివృద్ధి పనులను పెద్దఎత్తున చేపడుతున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ముందుగా ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులు మంత్రి ఆనం రామనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం: ఎమ్మెల్యే దగుమాటి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు అవసరం అని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో ఆదివారం కావలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ, జలదంకి మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మినీ స్టేడియంకు మహర్దశ పట్టనుందన్నారు. స్టేడియం చదును చేయటానికి అవసరమైన మట్టి తోలకం ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వహకులు సిద్దు, బుర్లా శ్రీధర్‌రెడ్డి, దేవరకొండ శ్రీను, ఆళ్ల శ్రీను టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, పోట్లూరి శ్రీనివాసులు, మదన్‌మోహన్‌రెడ్డి, విక్రమరెడ్డి, మొగిలి కల్లయ్య, గంగినేని వేంకటేశ్వర్లు, శానం హరి, జనిగర్ల మనోహర్, పులిమి రామిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలను ఆదివారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ ప్రారంభించారు.కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్‌గా ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి మణికంఠ, పీడీలు శ్రీనివాసులు, తిరుపాల్, బ్రహ్మయ్య, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

వింజమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ సాయిరాం, లక్ష్మీ దంపతులు తెలిపారు. శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిసూ కరపత్రాలు పంచారు. పిరమిడ్ నగర్, చెన్నకేశవస్వామి బజారు, సీతారామ తోట వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. హాజరైన ధ్యానులందరికీ నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీచేశారు. అనంతరం మాస్టర్లను సత్కరించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


సీతారామపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలోని సబ్‌స్టేషన్ వద్ద జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. మొదటి రోజు ఆటలో మారంరెడ్డిపల్లి, సీతారామపురం బెస్తకాలనీ టీంలు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకులు తోట మనోహర్, షేక్ బాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

బిట్రగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):ముంగమూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఆదరణ కేంద్రంలోని పేదలు, అనాథలు, అభాగ్యులకు ఆదివారం భీమ్ హనుమంతరావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు శివకుమార్, వనజ దంపతులు, కుటుంబ సభ్యులు సాయితేజ, వనిత, సుమంత్, మానస, భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆదరణ కేంద్ర డైరెక్టర్ సింహాద్రిరావు ఉన్నారు.

ఘనంగా కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాలు

● కులమతాలకతీతంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు గురజాల మాల్యాద్రి

కావలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపవని రోడ్డులోని కూచి చిరమాలకొండ క్షేత్ర ప్రాంగణంలో ఆదివారం కమ్మవారి సేవాసమితి సభ్యులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర నాయకుడు గురజాల మాల్యాద్రి నాయుడు, రాష్ట్ర ఖాదీబోర్డు ఛైర్మన్ కెకె.చౌధరి, రాష్ట్ర కాకతీయ సేవాసమితి జనరల్ సెకరట్రీ బెజవాడ వెంకట్రావ్, మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా 35మంది పేద విద్యార్థులకు రూ.2లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఆటలపోటీలు చేపట్టారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, గౌరవాధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దేవినేని వెంకటరమణయ్య, కంకణాల సుందరయ్య నాయుడు, మామిళ్లపల్లి అంజనేయచౌదరి, రావెళ్ల వెంకటరాయుడు, చల్లా వెంకటేశ్వర్లు, ఆరుముళ్ల వెంకటేశ్వరరావు, వర్దినేని భాస్కర్ నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● షేక్ కరీముల్లా, పంచాయతీ ఈవో



ఉదయగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఉదయగిరి మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కరీముల్లా తెలిపారు. పంచాయతీలో గల 16 వార్డుల పరిధిలో మురుగు కాలువలను శుభ్రం చేయడంతోపాటు వీధుల శుభ్రతకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఈ వారం అతిథి

? : ఇంటి పన్నుల వసూలు చేపడుతున్నారా.

! : పట్టణంలో 3,500 నివాసాలు ఉన్నాయి. డిజిటలైజేషన్ చేపట్టాం. త్వరలో ఇంటిపన్నుల వసూళ్లకు చర్యలు చేపడతాం.

?: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా.

! : పట్టణంలోని మూడు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారు. తరచూ సచివాలయాల తనిఖీలు చేపట్టి విధులకు హాజరు కాని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడుతున్నాం.

?: పంచాయతీ అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటున్నారు.

! : సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలపై తీర్మానాలు చేసి పరిష్కరిస్తున్నాం. పంచాయతీ అబివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

కందుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాలల, బాలికల బీసీ హాస్టల్‌లో బహుజన టీచర్స్ అసోసియేషన్ మహిళా విభాగం సభ్యులు ఆదివారం సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీటీఏ మహిళా నేత సమత విద్యార్థినులకు స్వీట్లు, రైటింగ్‌ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా మహిళా కార్యదర్శి ఏ అరుణకుమారి, సుభాషిణి, షర్మిల, మంగమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

సంగం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు తూర్పు దళితవాడలో రూ. 3 లక్షల నిధులతో డ్రైనేజీ పనులు ఆదివారం ప్రారంభించారు. డ్రైనేజీ లేక కాలనీవాసులు గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ. 3 లక్షల పంచాయతీ నిధులతో డ్రైనేజీ పనులు చేస్తున్నారు. పనులు పూర్తయితే కాలనీలో ప్రధాన సమస్య కొంతవరకు తీరినట్లవుతుందని కాలనీ వాసులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముసునూరులోని ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గౌడ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పెనుగొండయ్యగౌడ్, కార్యదర్శి బ్రహ్మయ్య గౌడ్, ఉప్పాల శ్రీనివాసులు, తుళ్లూరు శ్రీనివాసులు, సురేష్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

దోమతెరలు, దుప్పట్ల అందజేత

కావలి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని గిరిజన బాలుర వసతిగృహం విద్యార్థులకు ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెంచల నరసింహారెడ్డి మిత్రబృందం సభ్యులతో కలిసి దోమతెరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఆంజనేయులు, శ్రీనివాసరావు, రమణయ్య, పాల్గొన్నారు.

అన్నవరంలో వైద్యశిబిరం

జలదంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మజ, సిబ్బంది ఆదివారం అన్నవరంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 129 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరం కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. అనంతరం పంచాయతీ అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్తమ్మ, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి ఉన్నారు.

ముగ్గులతో లక్ష్మీ కళ

- మన సంస్కృతిని భావితరాలకు అందించాలి
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఇల్లాలు ముగ్గులు వేస్తే ఆ ఇంటికి లక్ష్మీ కళ వస్తుందని, పాశ్చాత్య నాగరికత పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వీఆర్సీ మైదానంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సీఎంఆర్-చందనా బ్రదర్స్ సంతూర్ సెల్సిలియా, పెర్‌ఫెక్ట్ సంయుక్తంగా నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మొత్తం 74 మంది పోటీలో పాల్గొని అందమైన ముగ్గులను తీర్చిదిద్దారు. కోటంరెడ్డి వాటిని పరిశీలించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ప్రసం గించారు. ప్రాచీన కళ అయిన ముగ్గులు వేయ డాన్ని నేటి తరం మరచి పోకుండా ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ప్రతి ఏటా పోటీలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఆంధ్రజ్యోతి మంచి ఆశయానికి సీఎం ఆర్-చందనా బ్రదర్స్, సంతూర్ సెల్సిలియం, పెర్‌ఫెక్ట్ సంస్థలు ప్రోత్సాహం అందించడం ప్రశం సనీయమన్నారు. రాజీ యాడ్స్ పెంచలయ్య మాట్లాడుతూ ముగ్గుల విశిష్ట తను తెలియజే శారు. ఈ పోటీకి న్యాయనిర్ణేత లుగా వ్యవహరించిన పీ నాగేశ్వర మ్మ, డాక్టర్ ప్రసన్నపూర్ణ, సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ ముగ్గులు వేయడం వల్ల మహిళలకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్ర మానికి విశిష్ట అతిథు లుగా సీఎంఆర్-చందనా బ్రదర్స్ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్, మాజీ కార్పొ రేటర్ సత్యనాగేశ్వరరావు హాజరయ్యారు. మొదటి మూడు బహుమతులకు ముగ్గురిని విజేతలుగా ఎంపి క చేశారు. ఎం.జయ, సుజాత, డి.శ్రీలత, అద్దంకి లావణ్యాదేవి, ఏటూరి సుజాతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పోటీలను ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ కే హరికృష్ణ, ఎడిషన్ ఇన్‌చార్జి జీ రామకృష్ణ, బ్యూరో బీ నాగరాజు, యాడ్స్ ఇన్‌చార్జి అబ్దుల్ రహీం, సర్క్యులేషన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ అమరేంద్ర, సిబ్బంది పర్యవేక్షించారు. మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న కోటంరెడ్డి



ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు



వీఆర్సీ మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సీఎంఆర్ అధినేత శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ పెంచలయ్య తదితరులు

● గూడూరు : గూడూరులో జరిగిన ముగ్గుల పోటీల్లో సైదాపురం మండలం లింగ సముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మకు తృతీయ బహుమతి లభించింది. న్యాయనిర్ణేత లుగా సునీతసేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ, జీవని, పద్మావతి వ్యవహ రించారు. అధికసంఖ్యలో మహిళలు ముగ్గులు వేయడంతోపాటు వేటికవే సరిసాటిగా నిలవ డంతో విజేతల ఎంపిక కష్టసాధ్యమైందని న్యా యనిర్ణేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



ప్రోత్సాహక బహుమతుల విజేతలు ఏటూరి సుజాత, అద్దంకి లావణ్యాదేవి, డీ శ్రీలత, బండారు సుజాత, ఎం జయ



గూడూరులో మూడో బహుమతి సాధించిన శేషమ్మ

మెక్కిందంతా కక్కిస్తాం : టీడీపీ

వెంకటాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో అనికేపల్లి వైసీపీ నేత అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు చేసి దోచుకుని మెక్కిందంతా ప్రతి పైసాతో సహా తిరిగి కక్కిస్తామని టీడీపీ మండ లాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తెలిపారు. మండలంలోని అనికే పల్లిలో ఆదివారం గ్రామ స్థులు, టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనికే పల్లిలో సర్కార్‌తోపు కింద ఉన్న రూ.3 కోట్లు విలువ చేసే 4.97 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడన్నారు. గొలగమూడిలో చాకలి చెరువు కింద ఉన్న 20 ఎకరాల చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించుకొని అక్రమంగా లేఅవుట్ వేసి దాదాపు రూ.20 కోట్లకు అమ్మేశాడని ఆరోపించారు. జగనన్న లేఅవుట్ పేరుతో కాలనీలు నిర్మిస్తామని చెప్పి ఇసుక, సిమెంట్, కమ్మి దోచే శారని, చివరకు రూ.2కోట్ల బిల్లులు కూడా స్వాహా చేశారని, బేస్మెంట్ కూడా కట్టలేదని విమర్శించారు. జగనన్న లేఅవుట్ లెవెలింగ్ పేరుతో రూ.కోటి మెక్కేశారని ఆరోపించారు. రీ సర్వే పేరుతో పెద్దఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారని, రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే ఆయన చేసిన అవినీతి, అక్రమాలు బయటపడుతాయన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులు, దౌర్జన్యాలు చేయడంతోపాటు లెక్కలేనన్ని అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. ఆయన చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూ పగటి కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాల బాగోతం బట్టబయలు చేసి త్వరలో జైలుకు పంపించడం ఖాయమని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడికి క్రాంతిరత్న పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు తెలుగు సాంస్కృతిక సేవాసంస్థ క్రాంతిరత్న పురస్కారం అందజేసింది. ఈ అవార్డును ఆదివారం విజయవాడలోని రవీంద్రనాథ్ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన సంక్రాంతి జాతీయ జానపద సాహిత్య సమ్మేళనంలో గండికోట అందుకున్నారు. విద్యార్థులకు పద్య పోటీలు, పుస్తకమిత్ర గ్రంథాలయం స్థాపనతో ఈ పురస్కారం దక్కింది. ఆయనను ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీపీ రత్నం తదితరులు అభినందించారు.



క్రాంతిరత్న పురస్కారం అందుకుంటున్న గండికోట

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి

● పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



గుండాలమ్మపాలెంలో మాట్లాడుతూ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

కొడవలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కోలుకుంటున్న టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డిని ఆదివారం మండలంలోని గుండాలమ్మపాలెంలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పోలంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లగా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఆయన వెంట నాయకులు చెముకుల చైతన్య, కోటంరెడ్డి దివ్యరెడ్డి, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నాశిన ప్రసాద్, దేగా రవిరెడ్డి, తదితరులున్నారు.

టీడీపీ శ్రేణుల బైక్ ర్యాలీ



వీరేంద్రచౌదరిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

ఇందుకూరుపేట,(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి జన్మదినం సందర్భంగా ఆదివారం మండలంలోని మొత్తలు సెంటర్ నుంచి కొరుటూరు వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వీరేంద్రచౌదరిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్ల మల్లికార్జున, జీ.అనిల్‌కుమార్, బొల్లినేని రవినాయుడు, మునగాల రంగా రావు, బట్టేపాటి సురేష్‌నాయుడు, రామచంద్రయ్య, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన హైందవులు

మనుబోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావంకు మండలం నుంచి విశ్వహిందూ పరిషత్ మండల ఇన్‌చార్జి ఆలూరు రాము ఆచారి ఆధ్వర్యంలో పలువురు హైందవులు తరలివెళ్లారు.

బాల్‌బాడ్మింటన్ అధ్యక్షుడికి అభినందన

కోవూరు,(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాల్‌బాడ్మింటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, సహాయకార్యదర్శిగా ఎన్నికైన వై.విజయశంకరరెడ్డి, ఐ రమేష్ బాబులను ఆదివారం ఇనమడుగులో క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. రమేష్ బాబు ఇనమడుగు జడ్పీ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు.

పోరాటయోధుడు అజీజ్

● ఆత్మీయ సన్మానంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ హవా కొనసాగుతున్న రోజుల్లో టీడీపీ జెండా పట్టుకుని వీరోచిత పోరాటాలు నిర్వహించిన యోధుడు అబ్దుల్ అజీజ్‌ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి అజీజ్‌కు చిన్నదే అని మరిన్ని ఉన్నత పదవులు ఆయన కోసం ఎదు రు చూస్తున్నాయని చెప్పారు. పార్టీ సభ్యత్వాలు చేసిన నాయకులకే పార్టీ, నామినేటెడ్ పదవులు ఉంటాయని స్పష్టం చేశారు. తన సోదరుడు గిరిధర్‌రెడ్డిని టీడీపీ నాయకత్వం చేతుల్లో పెడుతున్నానని జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి అజీజ్‌కి దక్కిన పదవే నిదర్శనమన్నారు. గతేడాది ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుంచి శ్రీధర్‌రెడ్డి గెలవడని అనేక మంది చెప్పారని, కానీ 34 వేల మెజార్టీతో గెలిచి సత్తాచూపారని కొనియాడారు. అజీజ్ మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి సాఫ్ట్‌వేరు, గిరిధర్‌రెడ్డి హార్డ్ వేర్ ఇంజనీరు లాంటివాళ్లన్నారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా, ఎన్నికలకు చాలా సమ యం ఉన్నప్పటికీ గడప గడప కార్యక్ర మం నిర్వహిస్తూ ప్రతిపక్షాలకు అవకా శం లేకుండా చేస్తున్నారన్నారు. అనంత రం అజీజ్, రవిచంద్రలను కోటంరెడ్డి సోదరులు సత్కరించారు. ముందుగా మినీ బైపాస్‌రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, రాజా నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అజీజ్, రవిచంద్రను సత్కరిస్తున్న కోటంరెడ్డి సోదరులు

క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ

● నారాయణ స్పోర్ట్ మీట్ ముగింపులో నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వైద్యం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతా యని నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం నారాయణ ఆసుపత్రిలో ముగిసింది. విజేతలకు డీఎస్పీ జ్ఞాపికలు అందించారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపాలన్నారు. నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్న తంగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. కార్య క్రమంలో రవివర్మ, ఆదిశేషయ్య, ఉపాధ్యా యులు, పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

ఆటో డ్రైవర్లకు సబ్సిడీపై ఆటోలు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సుస్థిర ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం సబ్సిడీపై ఆటోలు ఇస్తోందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. ఆదివారం తెలుగునాడు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కోటంరెడ్డిని కలిశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సబ్సిడీతో 4074 ఆటోలను అందించారన్నారు. రూ.30వేలు డౌన్ పేమెంట్ కడితే రూ.3 లక్షల విలువైన ఆటో తెచ్చుకోవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం టీఎన్‌టీయూసీ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కువ్వారపు బాలాజీ, నాగేంద్ర, టీఎన్‌టీయూసీ నగర అధ్యక్షకార్యదర్శులు చప్పిడి వెంగయ్య, ప్రసన్న కుమార్, కోశాధికారి అన్నం చంద్రశేఖర్, మునుస్వామి, శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బంపర్ డ్రా కారు విజేత మోహన్

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఆదివారం రాత్రి చందన సీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ సేల్స్, న్యూ ఇయర్ బంపర్ డ్రా జరిగింది. ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. న్యూ ఇయర్ బంపర్ డ్రా కారు విజేతగా మర్రిపాడుకు చెందిన కే మోహన్ (కూపన్ నెంబరు 97742) ఎంపికయ్యారు. విజేతను ఎమ్మెల్యే ఫోన్‌లో పలకరించి అభినందనలు తెలిపారు. క్రిస్మస్ బంపర్ డ్రా విజేత హనీసాకు కారు అందజేశారు. గత వారం వీక్లీ డ్రాలో టీవీఎస్ స్కూటీ విజేత ధన్విక్‌కు స్కూటర్ అందజేశారు. అలాగే ఈ వారం స్కూటీ విజేతను లక్కీడిప్‌లో ఎంపిక చేశారు. విజేతగా నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కుకు చెందిన హరికృష్ణ (కూపన్ నెంబరు 8500)ను ప్రకటించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ చందనా బ్రదర్స్‌లో తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి బహుమతులు గెలుచుకోవాలని వినియోగదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందన, సీఎంఆర్ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్, శైలేంద్ర, రాజీయాడ్స్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతకు కారు తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కామాటివీధి శ్రీకృష్ణమందిరంలో ఆదివారం నెల్లూరు జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్ర మంలో సంఘం అధ్యక్షుడు చమ్మండి రాము, ప్రధాన కార్యదర్శి టీ శివశంకర్, డాక్టర్లు టీ జయసింహ, ఎం వెంకట్రావు, జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆదివారం ఖురాన్ కంఠస్థ పోటీలు జరిగాయి. నెల్లూరు, కృష్ణ, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో స్కూల్ ఫైనల్‌కి ఎంపికైన 44 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి సెమీ ఫైనల్స్ పోటీలు నిర్వహించి ఫైనల్స్‌కి 11 మందిని ఎంపిక చేశారు. సెమీ ఫైనల్స్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.500, సర్టిఫికెట్, పతకం అందజేశారు. ఫైనల్స్ ఫిబ్రవరి 9న విజయవాడలో జరుగుతాయని జమాతే ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు ఎం అన్వర్‌బేగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, కార్పొరేటర్ కరిముల్లా, లేబర్ బీడీ అధినేత జామాలుల్ల, ఖాదర్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని పోస్టల్ కాలనీకి చెందిన మోపూరు బుజ్జమ్మ(85) ఆదివారం మృతి చెందడంతో ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. చిరంజీవి ఐ బ్యాంక్ అధ్యక్షుడు సుధీర్ సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ బుజ్జమ్మ నేత్రాలను సేకరించారు.


సకల విన్యాసాలు మానుకో కాకాణీ..

● జనసేన పార్టీ నేత బొబ్బేపల్లి సురేష్‌నాయుడు

వెంకటాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళపై లైంగిక దాడి కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యను బయటకు తీసుకొచ్చేందుకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సకల విన్యాసాలు ప్రదర్శిస్తుండడం హాస్యాస్పదంగా ఉందని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఎద్దేవా చేశారు. మండలంలోని సర్వేపల్లిలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వెంకటశేషయ్య ఎక్కడ నోరు తెరిస్తే తన అక్రమ ఆస్తుల విషయం బయటపడుతుందన్న భయం కాకాణికి పట్టుకుందన్నారు. గత వైసీపీ ఐదేళ్లలో బడుగు, బలహీన వర్గాలపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన చరిత్ర కాకాణిదేనన్నారు. అలాంటి వ్యక్తి కూడా అర్థరహిత విమర్శలు చేస్తుండడం దారుణమన్నారు. కాకాణికి ధైర్యం ఉంటే గత వైసీపీ ఐదేళ్లలో నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల్లో కేసుల జాబితాను బయటకు తీద్దామని, వాటిపై బహిరంగ చర్చకు వచ్చే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. వైసీపీ అక్రమాలను ప్రశ్నించినందుకు తనపై కూడా కేసులు బనాయించారని విమర్శించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

విడవలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం బీసీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో గిరిజన కుటుంబాలకు చెందిన మూడు పూరిళ్లు కాలిపోయిన విషయం విదితమే. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేతో పాటు ఏపీ గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన వెల్ఫేర్ హాస్టల్స్ సంఘం ఆదివారం చేయూతనిచ్చారు. బాధితుల్లో ఒకరైన అడిపూడి శైలజ కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.10 వేల ఇవ్వగా ఆ నగదును టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, సింహాద్రి అయ్యప్పలు అందజేశారు. అలాగే అడిపూడి శైలజ, గడ్డం బ్రహయ్య, గడ్డం చెంచయ్య కుటుంబాలను ఏపీ గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన వెల్ఫేర్ హాస్టల్స్ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు డీఎల్ శేఖర్, చౌటూరు శీనయ్యలు పరామర్శించి నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుడుముల మోహన్, టీడీపీ నేత బండ్ల గోవర్ధన్, వార్డు మెంబరు సుబ్బారావు పాల్గొన్నారు.



శైలజ కుటుంబానికి నగదు అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

న్యూస్ బాక్స్

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

ముత్తుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేయడానికి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. మండలంలోని మొల్లూరు, దువ్వూరివారిపాలెం, డమ్మయ్యగారిపాలెం, పంటపాలెం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు సురవౌళి, ప్రదీప్, నిగమశ్రీ, కొండమ్మ, రాజేంద్రప్రసాద్, శ్రీదేవి, కావ్యశ్రీ, లీలావతి, గుప్తరాజు, కృష్ణ, సుమలత, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బహిరంగ సభకు తరలిరండి

కోవూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్న బహిరంగసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివారాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని పాటూరు, పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు, గండవరపు శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, విజకుమార్, చాంద్‌బాషా, భోగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం నేత మృతికి సంతాపం

ముత్తుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత దేవారెడ్డి సదానందరెడ్డి (80) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి సీపీఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, వైసీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శివప్రసాద్, శ్రీనివాసులురెడ్డిలు సంతాపం తెలిపారు. సదానందరెడ్డి కుమారులు దేవారెడ్డి అశోక్ రెడ్డి, నాగార్జునరెడ్డిలను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు.

జిల్లా సైన్స్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

వెంకటాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా సైన్స్ కేంద్రాన్ని ఆదివారం పూడిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్‌లోని విశేషాలను జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఈపూరు శరత్‌నాయుడు పాల్గొన్నారు.

మడ్డి ఆయిల్‌తో ఆహార పదార్థాలు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బుచ్చి పట్టణం చెన్నూరురోడ్డులోని ఓ దుకాణదారుడు ఆదివారం మడ్డి ఆయిల్‌తో చిప్స్ తయారు చేస్తుండగా గమనించిన స్థానిక టీడీపీ, సీపీఎం నాయకులు గుర్నాం ధం, ఎంవీ.శేషయ్య, శింగంశెట్టి కిషోర్‌లు అడ్డుకున్నారు. వాహనాల నుంచి తీసే కాలం చెల్లిన నల్లని మడ్డి ఆయిల్‌ను తలపించేలాంటి బాగా మరిగిన నూనెతో ఆహార పదార్థాలు తయారు చేసి ప్రజారోగ్యాన్ని పాడు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుసైడు ఆహార పదార్థాలు తయారు చేసే దుకాణాలలో పరిశీలించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని వారు కోరారు.

నింగిలో విరిసే హరివిల్లు నేలకు దిగింది. రంగురంగుల ముగ్గులతో తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం కళకళలాడింది. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఏటా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు కేంద్రాల్లో వేడుకగా జరిగాయి. ఈ పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లి కేంద్రాల్లోనూ, ప్రస్తుత తిరుపతి జిల్లాలోని గూడూరులోనూ జరిగాయి. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి కళను ముందే మైదానంలో ఆవిష్కరించారు. పిల్లలు, పెద్దవాళ్లు, విద్యార్థినులు పోటీలు పడి ముగ్గులు వేశారు.

తిరుపతిలో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ముందే వచ్చిన ముగ్గుల సంక్రాంతి

ముగ్గు వేస్తున్న విద్య

చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, గూడూరుల్లో వేడుకలా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు



ప్రథమ బహుమతి

విద్యకు బహుమతి అందిస్తున్న అంజి, మౌర్య తదితరులు

ముగ్గుల పోటీల్లో విజేతలు

- ఎం.విద్య, కొర్లగుంట, తిరుపతి: మొదటి బహుమతి
- నీలమణి, భవానినగర్, తిరుపతి: రెండో బహుమతి
- కె.ప్రమీల, ఎస్టీవీనగర్, తిరుపతి: మూడో బహుమతి

కన్సొలేషన్ విజేతలు

- కె.పూజిత, ఎంఆర్‌పల్లె, తిరుపతి
- ఎన్.పద్మ, బైరాగిపట్టెడ, తిరుపతి

ద్వితీయ బహుమతి





బహుమతి అందుకుంటున్న నీలమణి



బహుమతి అందుకుంటున్న ప్రమీల

తృతీయ బహుమతి



తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో నిర్వహించారు. లోకల్ స్పాన్సరర్‌గా చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి వ్యవహరించారు. ఈ పోటీల్లో 106 మంది మహిళలు, విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు అతిథులు మున్సిపల్ కమిషనరు మౌర్య, చిల్లీస్ అంజి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన ముగ్గుల పోటీల్లో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ముగ్గులోనూ సంక్రాంతి శోభ కనిపిస్తోందన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి.. విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగ ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యాపకురాలు డాక్టర్ కొణిదల శోభ వ్యవహరించారు.



ముగ్గుల ముందు సెల్ఫీలు

చిత్తూరులో 130 మంది



ముగ్గు వేస్తున్న బి.విజయలక్ష్మి

చిత్తూరు(సెంట్రల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఈ పోటీలకు 130 మంది హాజరై ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ఈ పోటీలకు లోకల్ స్పాన్సర్‌గా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, జీజేఎం సుభీభవ ఏసీ మహల్ (చిత్తూరు) సహకారం అందించారు. మొదటి మూడు స్థానాల్లో బి.విజయలక్ష్మి (గుర్రప్పనాయుడు వీధి-చిత్తూరు), డి.బుజ్జీరావు (లక్ష్మీనగర్ కాలనీ-చిత్తూరు), జి.ప్రతిభ (మురకంబట్టు అగ్రహారం-చిత్తూరు) నిలిచారు. ముఖ్య అతిథులుగా హాజరైన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉమ్మడి జిల్లా విజేత

- మదనపల్లె మహిళ రెడ్డిరాణి



ముగ్గు వేస్తున్న రెడ్డిరాణి

మదనపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విజేతగా మదనపల్లెకు చెందిన ఉత్తరాది రెడ్డిరాణి ఎంపికయ్యారు. మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు స్థానిక స్పాన్సరర్లుగా జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలు, ఆర్.కె.జ్యువెలర్స్, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ వ్యవహరించారు. మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణి, ఎ.పద్మ, వి.రెడ్డిరాజేశ్వరి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, స్పాన్సరర్లు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, ఆర్.కె.జువెలర్స్ అధినేత పచ్చిపాల తులసి, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లెల్లో మొదటి బహుమతి సాధించిన ముగ్గురిలో మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణిని జిల్లాస్థాయి విజేతగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు.

గూడూరులో వేడుకగా పోటీలు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీల్లో 45 మంది పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్‌గా డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) వ్యవహరించగా, నెల్లూరుకు చెందిన సీఎంఆర్, చందన బ్రదర్స్ స్థానిక పార్టనర్‌గా వ్యవహరించారు. ప్రథమ బహుమతి స్థానిక త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ , ద్వితీయ బహుమతిని గూడూరు మండలం నెల్లటూరుకు చెందిన ఎన్.సుశ్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మ గెలుచుకున్నారు. డీఎస్పీ వీవీ రమణకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతుల కింద చీరలు, మరో 39 మందికి ప్రత్యేక బహుమతులను పాశం సంధ్యారాణి సహకారంతో అందించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు పాల్గొన్నారు.



గూడూరులో మొదటి బహుమతి పొందిన ముగ్గు వేస్తున్న ఎం.విష్ణుప్రియ

బోధన, పరిశోధనల్లో చరిత్రకు ప్రాధాన్యం పెరగాలి

- ప్రముఖ సాహిత్యవేత్త నాగసూరి వేణుగోపాల్
- గూడూరులో ముగిసిన రెండు రోజుల ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు



నాగసూరి వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)/గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చరిత్రకు మరింత ప్రాధాన్యం పెరగాలని ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. గూడూరులోని ఎస్‌కెఆర్ డిగ్రీ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభలో నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. మారిన సామాజిక పరిస్థితుల్లో చరిత్ర కీలకంగా మారిందన్నారు. చరిత్రను మరింత విస్తృతమైన, విభిన్నమైన కోణాల్లో పరిశీలించాలని కోరారు. మరుగున పడిన చరిత్రను తవ్వి తీయాల్సిన బాధ్యత ఈ తరం పరిశోధకులపై ఉందన్నారు. చరిత్రను మనుషుల వ్యక్తిగతం, కుటుంబం, సామాజిక కోణాల్లో విశ్లేషించుకోవచ్చని సూచించారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్‌లో చరిత్రను అన్ని రకాలుగా వర్గీకరించుకొని ప్రత్యేక సమాంతర సదస్సులు నిర్వహించాలన్నారు. ఎంతో గొప్ప చారిత్రక ప్రదేశాలపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గాంధీ, పొట్టి శ్రీరాములు గురించి ఈ తరానికి తెలియని విషయాలను తాను పుస్తక రూపంలో అందించినట్టు చెప్పారు. పలు రాష్ట్రాలకు చెందిన 350 మంది ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీరికి నిర్వాహకులు సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, ఎస్వీయూ ఆర్కియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ డి. కిరణ్‌క్రాంత్ చౌదరి, కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ గోవిందు సురేంద్ర, చరిత్రకారుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- చరిత్ర పరిశోధనల్లో కొత్త ధోరణులపై దృష్టి సారించాలి.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను చరిత్ర పరిశోధనకు ఉపయోగించుకోవాలి.
- చైల్డ్ అబ్యూజింగ్, చైల్డ్ పోర్నోగ్రఫీ, అడల్ట్‌కంటెంట్ వంటి రుగ్మతలపై పరిశోధించాలి.
- డిగ్రీ స్థాయిలో చరిత్రను తప్పనిసరిగా బోధించాలి.
- సంస్కృతి, సంప్రదాయాలను కొత్త తరానికి అందించాలి.
- చరిత్ర రంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి.
- చారిత్రక ప్రదేశాలపై పరిశోధనలు నిర్వహించి, ఆ ప్రదేశాలను అభివృద్ధి చేయాలి.
- చరిత్రను చదువుకున్న వారికి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.



తిరుమలేశుడి సేవలో నటి మీనాక్షి చౌదరి

లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి.. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

జగన్ విధానాలతోనే పార్టీ మునిగింది

- సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఆత్మీయ సమావేశంలో నేతల ధిక్కార స్వరం



మాట్లాడుతున్న నాగలాపురం జడ్పీటీసీ

సత్యవేడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను పట్టించుకోకుండా జగన్ వన్‌మ్యాన్ షోలాగా వ్యవహరించారు. ఆయన చేపట్టిన ఏకపక్ష విధానాలతోనే వైసీపీ మునిగింది' అని పార్టీ నేతలు కుండబద్దలు కొట్టారు. సత్యవేడులో ఆదివారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి సమక్షంలోనే నాయకులు జగన్‌పై నిరసన స్వరం వినిపించారు. ప్రధానంగా నాగలాపురం జడ్పీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐప్యాక్ టీం, వలంటీర్ వ్యవస్థను నమ్ముకుని కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కార్యకర్తల మనోభావాలు గౌరవించమని జగన్‌కు చెప్పండంటూ భూమనకు సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు కడుపులో కత్తులు పెట్టుకుని పైకి ఐక్యతారాగం వినిపిస్తున్నారని కేవీబీపురానికి చెందిన ఓ నేత అన్నారు. మరికొందరు కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. కడుపులో ఉన్న కత్తులను నూరకుండా, పార్టీ బలోపేతం కోసం పనిచేద్దామని ఇన్‌చార్జి రాజేష్ అభ్యర్థించారు. తమ కడుపులో ఉన్న కత్తులను సానబెట్టి, ఆ కత్తులను టీడీపీపైకి విసరండని కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాను జగన్‌తో మాట్లాడి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సుశీల్ కుమార్‌రెడ్డి, బీరేంద్రవర్మ, నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, దయాకర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, చిన్న, సురేష్, అపరంజిరాజు, చిన్నదురై, హరిశ్చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, క్రిష్ణయ్య, మాధవి, సొరకాయలు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ప్రస్తావనేదీ?

ఏ చిన్న కార్యక్రమం జరిగినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పొగడ్తలతో ముంచెత్తే ఆపార్టీ నాయకులు.. ఈ సమావేశంలో ఆయన్ను ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇంచార్జ్ రాజేష్, ఎంపీ గురుమూర్తి మాత్రమే తమ ప్రసంగంలో పెద్దిరెడ్డిని ప్రస్తావించారు.

పక్షుల పండుగ ఏర్పాట్ల పరిశీలన



మొక్కకు నీరు పోస్తున్న పీసీసీఎఫ్ నాయక్, చిత్రంలో సీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వోలు మెహబూబ్‌బాషా, హారిక

దొరవారిసత్రం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఏకే నాయక్ ఆదివారం తిరుపతి డివిజన్ సీఎఫ్ సెల్వంతో కలిసి ఆయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈనెల 17, 18, 19 తేదీలలో పక్షుల పండుగను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు ఆయన వచ్చారు. స్థానిక అధికారులతో చర్చించారు. చెక్‌లిస్ట్ ప్రాంతంలో మొక్కలను నాటారు. పక్షుల కేంద్రం విశిష్టతను పండుగ సమయంలో బాగా తెలియజేసేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఏటా పక్షుల సంఖ్య తగ్గుతుండటంతో కేంద్రంలోని చెరువుల కింద సాగు చేస్తున్న రైతులను ఆర్గానిక్ వైపు నడిపించేలా ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట డీఎఫ్‌వోలు హారిక, మెహబూబ్ బాషా, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీర్లుగా రాణించాలి



గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్దె, డాక్టర్ వంకి పెంచలయ్య తదితరులు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విభాగాలలో ఉత్తమ ఇంజనీర్లుగా రాణించేందుకు పట్టుదలతో కృషిచేయాలని నాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దె అన్నారు. ఆదివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకర విద్యాసంస్థల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యతోపాటు వివిధ బహుళజాతి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను కల్పించడం అభినందనీయమన్నారు. సమాజంలోని విప్లవాత్మక మార్పులను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ వాటికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని తెలిపారు. వంకి అరవింద, వంకి అనూష, ప్రొఫెసర్ కృష్ణయ్య, వేణుమాధవ్, దుర్గాప్రసాద్, రాజయ్య, రామయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలను అందిస్తున్న రెడ్ సంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూతనందించేలా ప్రతినెలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విష్ణువందన, అనిత, లక్ష్మీ, జానా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి



సమావేశంలో అఖిలపక్ష నాయకులు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే కలపాలని అఖిలపక్ష నాయకులు డిమాండు చేశారు. ఆదివారం స్థానిక షాదిమంజిల్‌లో అఖిలపక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయడంతో జిల్లా కేంద్రం తిరుపతికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాలేషా, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్‌కుమార్, అబ్దుల్‌రహీం, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, ప్రణీత్, సునీల్, ప్రభాకర్, చంద్రయ్య, శశికుమార్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే ఉన్నత లక్ష్యాలు



బహుమతులు అందజేస్తున్న డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. ఆదివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థినుల తల్లిదండ్రులతో అధ్యాపకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు క్రీడాపోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మునిగిరీష్, సురేష్, శ్రీనివాస్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయంలో ఆదివారం 3వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక పోస్టర్లను బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా నాయకులు కారంశెట్టి మల్లికార్జున మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్తంగా ఫిబ్రవరి 16న తిరుపతి వైఖానస కల్యాణ వేదికలో మూడో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే బ్రాహ్మణ కుటుంబ వధూవరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు డీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడులు

వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. వారి నుంచి రూ.1150 నగదు, 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి మొదటి బహుమతిని అందుకుంటున్న ఎం.విష్ణుప్రియ



డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి రెండో బహుమతిని అందుకుంటున్న ఎన్.సుశ్మిత



డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి మూడో బహుమతిని అందుకుంటున్న ఎం.శేషమ్మ



అలరించిన ముత్యాల ముగ్గుల పోటీలు

● గూడూరులో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు శ్రీచైతన్య పాఠశాల ఆవరణ ఆదివారం ముగ్గులతో హరివిల్లులా మారింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్‌గా డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) వ్యవహరించగా, నెల్లూరుకు చెందిన సీఎంఆర్, చందన బ్రదర్స్ స్థానిక పార్టనర్‌గా వ్యవహరించారు. ఈ పోటీలలో 45 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి విజేతగా స్థానిక త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ, ద్వితీయ బహుమతిని మండలంలోని నెల్లటూరుకు చెందిన ఎన్.సుశ్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మలు గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతలుగా సునీత సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ, జీవని, పద్మావతి వ్యవహరించారు. అధిక సంఖ్యలో మహిళలు ముగ్గులు వేయడంతో పాటు వేటికవే సరిసాటిగా నిలవడంతో విజేతల ఎంపిక కష్టసాధ్యమైందని న్యాయనిర్ణేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. విజేతలకు డీఎస్పీ వీవీ.రమణకుమార్ చేతుల మీదుగా బహుమతిగా చీరలను అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులు కింద చీరలు, మిగిలిన 39 మందికి పాశం సంధ్యారాణి సహకారంతో ప్రత్యేక బహుమతులు అందించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు, ఆంధ్రజ్యోతి వీసీఇన్‌చార్జి గిరీష్‌కుమార్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు సారంగం సులక్ష్మీ, జీవని, పద్మావతి

మహిళల్లో సృజనకు ప్రతిరూపం: డీఎస్పీ

ముగ్గులు మహిళలలోని కళకు ప్రతిరూపమని డీఎస్పీ వీవీ.రమణకుమార్ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాల క్రీడా మైదానంలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముందుకొచ్చి గడిచిన 16 సంవత్సరాలుగా గూడూరులో ఏటా సంక్రాంతి పండుగలకు ముందు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల్లో పనిఒత్తిడి తగ్గించేందుకు ఇలాంటి పోటీలు వారికి ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇస్తాయన్నారు. ఇలాంటి పోటీలతో మహిళలలో ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందించవచ్చునన్నారు. న్యాయనిర్ణేతలలో ఒకరైన సారంగం సులక్ష్మీ మాట్లాడుతూ పాతరోజుల్లో ఇంటిముంగిట బియ్యం పిండితో ముగ్గులు వేయడం అలవాటుగా ఉండేదన్నారు. ఆ పిండి చీమలకు, పక్షులకు ఆహారంగా ఉండేదన్నారు. అపార్టుమెంట్ల సంస్కృతి పెరగడంతో ముగ్గులకు ఆదరణ తగ్గిందన్నారు. మహిళలను రంగవల్లుల వైపు మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి చేస్తున్న ఈ ప్రయత్నం మరువలేనిదన్నారు.



మొదటి బహుమతి పొందిన ముగ్గు



రెండో బహుమతి పొందిన ముగ్గు



మూడో బహుమతి పొందిన ముగ్గు

గురుకులంలో క్రీడా పోటీల ప్రారంభం



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం బీసీ గురుకులంలో జోన్-3 క్రీడా పోటీలను ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం సాయంత్రం బహుమతులు అందిస్తున్నట్లు దొరవారిసత్రం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు.చి జోన్-3లోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన ఎర్రగొండ, వినుకొండ, వేటపాళెం, వెంకటగిరి, దొరవారిసత్రం, నిజాంపట్నం, కోట, కొండపి, దాచేపల్లి గురుకుల పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

తెలుగు సంప్రదాయాలను కాపాడుకుందాం..!

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సిరామిక్ కళాశాలలో సిరామిక్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయన్నారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోడూరు మీరారెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రోహిణి, వెంకటేశ్వర్లు, శివకుమార్, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా జయకుమార్‌రెడ్డి



తడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ట్రేడ్ యూనియన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా తడకు చెందిన బోడిలింగాలపాడు జయకుమార్‌రెడ్డిని వైసీపీ అధిష్ఠానం నియమించింది. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నెల్లూరులో కాకాణి, కిలివేటిలను శాలువతో సత్కరించారు.

ఫోటో : 5 వీకేడీ 4 : మహిళలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు పరిధిలో ఉన్న ఎంజేఆర్ కాలనీలో ముందస్తు సంక్రాంతి సంబరాలను స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి టీడీపీ మండలాధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, తూపిలి సాగునీటి సంఘం అధ్యక్షుడు తిరుమూరు శ్రీనివాసులురెడ్డి బహుమతులు అందజేశారు.

గురుకులంలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు

వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో గత 25 సంవత్సరాలు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఒక్కటయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామంటూ పలు తీర్మానాలు చేపట్టారు. రానున్న రోజుల్లో అత్యాధునిక టెక్నాలజీతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పూర్వ విద్యార్థి టూరిజం ఐటీ ఛీఫ్ సెక్రటరీ సునీల్‌ను స్నేహితులు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు వెంకటశేషయ్య, గౌరవ అధ్యక్షులు కొణతం సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి దండు ప్రసాద్, కోశాధికారి కిషోర్, ప్రధాన కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, గుంటూరు, చిత్తూరు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటమ్మకు ప్రత్యేక అభిషేకాలు

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి టీడీపీలో శాశ్వత సభ్యత్వం



ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న ప్రవీణ్

సూళ్లూరుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో సూళ్లూరుపేటకు చెందిన వేనాటి ప్రవీణ్ రెడ్డి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ స్వగృహంలో ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి సభ్యత్వాన్ని తీసుకున్న అతడిని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏజీ కిషోర్, పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పరసా రాజా, మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆవును ఢీకొని ఒకరికి గాయాలు

వెంకటగిరి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిగుంట వద్ద ఆదివారం ఓ ఆవును ద్విచక్రవాహనం ఢీకొని స్థానిక రాజావీధిలోని లైఫ్‌స్టైల్ బట్టల దుకాణం యజమాని అఖిల్ గాయపడ్డాడు. 108 వాహనంలో వెంకటగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంఖారావ సంఘీభావ ర్యాలీ



కోట క్రాస్ రోడ్డులో మానవహారం

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలో ఆదివారం విజయవాడలో జరిగే హైందవ శంఖారావం మహాసభకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన బ్రాహ్మణులు కోట పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో హైందవ శంఖారావం పూరించి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కోట క్రాస్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఈ తరానికి ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో హైందవ పరిరక్షణ నాయకులు బీవీఎస్ నారాయణరావు, అనంతబాబు, సుబ్రహ్మణ్యంరెడ్డి, మురళీ, నరేష్, హరి, చంద్రారెడ్డి, హేమంత్‌శర్మ, సాయిబాబా, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అనారోగ్యంతో ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆదిలక్ష్మి

నాయుడుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నెల్లూరు జిల్లా కలువాయికు చెందిన అజాముద్దీన్ (45) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. అజాముద్దీన్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట క్రాస్ రోడ్డులోని తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఓ కారు డివైడర్‌ను ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన నలుగురు పూర్వపు విద్యార్థులు వాకాడులోని గురుకులంలో జరిగిన విద్యార్థుల సమ్మేళనానికి హాజరై కారులో నలుగురు స్నేహితులు కోట క్రాస్‌రోడ్డు మీదుగా గుంటూరుకు వెళ్తున్నారు. తిన్నెలపూడి రోడ్డు వద్ద కారు వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టడంతో కారు ముందు టైర్లు పగిలి ఒక్కసారిగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్వల్పగాయాలతో బయటపడ్డారు.

జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటసుబ్బరాజు



ఓజిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం ఆరిమేనిపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టరు కొండూరు వెంకటసుబ్బరాజు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఉత్తర్వులు ఇచ్చారని మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి ఆదివారం తెలిపారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.